ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు

- వడ్లు నిల్వ చేసేందుకు గోదాములను గుర్తించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జగిత్యాల, నవంబర్ 2: జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి శనివారం ఆయన ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ అధికారులకు పలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను నిత్యం పర్యవేక్షించాలన్నారు. కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, ఇతర వసతులను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు రకం ధాన్యం సన్న రకం కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దన్నారు. కేంద్రాల వద్ద ధాన్యం నాణ్యతను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా చూడాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీవో 27పై చర్చించాలని, రైస్ మిల్లర్లతో బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు గోదాంలను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, జీవో 27పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించామని, ముందుగా రైస్ మిల్లర్లు అండర్ టేకింగ్ సమర్పించి తర్వాత బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాలని సమాచారం అందించినట్లు తెలిపారు. రైతులు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్

- ప్రజా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మల్యాల, నవంబర్ 2: ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మల్యాల ఎక్స్‌రోడ్ నుంచి మేడిపల్లి మండలం కాసారం వరకు (11 కిలోమీటర్ల మేర) డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, దేశానికి గ్రామలే పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బొడిగ శోభ, సుద్దాల దేవయ్య, ఆర్డీవో పులి మధుసూదన్, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఆర్‌అండ్ బీ ఈఈ శ్రీనివాస్, ఎస్ఈఈ బానోతు లక్ష్మణ్, డీఈఈ సత్యనారాయణ, నాయకులు మోరపల్లి సత్యనారాయణరావు, బింగి వేణు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, ఆనందరెడ్డి, రాంలింగారెడ్డి, గాజుల మల్లేశం, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, వంశీ, హరినాథ్, లక్ష్మణాచారి, బొట్ల ప్రసాద్, సతీశ్‌రెడ్డి, చెవులమద్ది శ్రీనివాస్, రాజ నర్సింగరావు, మల్యాల, కొడిమ్యాల, మేడిపల్లి మండలాల కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో రఘువరన్

జగిత్యాల రూరల్, నవంబర్ 2: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. తిమ్మాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 136 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చూడాలన్నారు. అలాగే, కల్లెడ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ సందీప్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఐకేపీ ఏపీఎం గంగాధర్, సివిల్ సప్లయ్ అధికారి వరప్రసాద్, ఏఈవోలు రవళి, రమ్య, కార్యదర్శులు రాజు, రాఘువేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, నవంబర్ 2: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, లచ్చునాయక్‌తండా, రేచపల్లి, రంగపేట, పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో చౌడారపు గంగాధర్ ప్రారంభించారు. ఏపీఎం రాజయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 2: మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల, కోనరావుపేట, బండలింగాపూర్, రాజేశ్వర్‌రావుపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సహకార సంఘాల అధ్యక్షులు కేసిరెడ్డి నవీన్‌రెడ్డి, నేరెళ్ల శంకర్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఏఈవో మనోజ్ఞ, పీఏసీఎస్ డైరెక్టర్లు చిన్నభూమయ్య, గంగనర్సయ్య, సీవో తిరుపతి పాల్గొన్నారు.

మేడిపల్లి, నవంబర్ 2: మండల కేంద్రంతోపాటు కట్లకుంట, పోరుమల్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి సురేందర్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, ఏఈవో సౌజన్య, సీసీలు శ్రీనివాస్, రత్నాకర్, మాజీ సర్పంచులు గడ్డం నారాయణరెడ్డి, తౌటి తిరుపతిరెడ్డి, నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, పన్నాల రాజేశ్వర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నూతిపల్లి శంకర్, కొండ్ర గంగాధర్, మాదం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సారంగాపూర్/కథలాపూర్, నవంబర్ 2: సారంగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ మైత్రి, అర్చన, కథలాపూర్ మండలం అంబారిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి చింత శరణ్య రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు రవీందర్, రాజేశ్ తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 2: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బండలింగాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు దేవిశ్రీప్రసన్న, మణిదీప్ ఎంపికైనట్లు పీఈటీ కార్తీక్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం జితేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయికల్, నవంబర్ 2: రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదివిన భావన బీఎస్సీ నర్సింగ్ సీటు సాధించింది. మంచిర్యాలలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్ పొందగా, పట్టణంలో భావనను శనివారం డీఐఈవో వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జిందం రాజేశ్, అధ్యాపకులు రజిత, ఉషారాణి, తదితరులు అభినందించారు.

ఎమ్మెల్సీని కలిసిన ఏఈలు

సారంగాపూర్, నవంబర్ 2: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల పంచాయతీ రాజ్ ఏఈలుగా కళ్యాణ్ వర్మ, విశ్వేందర్ ఇటీవల బాధ్యతలు చేపట్టగా శనివారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కథలాపూర్, నవంబర్ 2: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. కథలాపూర్, భూషణరావుపేట, సిరికొండ గ్రామాల్లో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయా చోట్ల ఎమ్మెల్యే మాట్లాడారు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని చెప్పారు. కాగా, భూషణరావుపేటలో కొనుగోలు కేంద్రాల్లో తూకంలో కోతలు లేకుండా మిల్లర్లతో మాట్లాడాలని అభ్యుదయ రైతు సంఘం, ఆదర్శ రైతు సంఘం నాయకులు విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే, చింతకుంటకు చెందిన కట్ట విజయ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను విప్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సీఈవో ఉశకోల అరుణ్, సింగిల్ విండో డైరెక్టర్లు గుండారపు గంగాధర్, అంబటి రవి, కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, చెదలు సత్యనారాయణ, తొట్ల అంజయ్య, భైర దేవ్‌యాదవ్, గడ్డం చిన్నారెడ్డి, వాకిటి రాజారెడ్డి, పూండ్ర నారాయణ, ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, నాయకులు

ఎంఈవోకు సత్కారం

కథలాపూర్, నవంబర్ 2: కథలాపూర్ ఎంఈవోగా పనిచేసి ఇటీవల బదిలీపై కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా వెళ్లిన ఆనందరావుకు శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలాధికారులు, ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆనందరావును మండలాధికారులు, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంఈవోలు లోకిని శ్రీనివాస్, నరేశం, కోరుట్ల నోడల్ ఆఫీసర్ మార్గం రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ హెచ్ఎంలు అర్జున్, కిషన్‌రావు, ప్రధానోపాధ్యాయులు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అల్లె పరమేశ్వర్, శశిధర్, విజయ్, రవి, సాయిరెడ్డి, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులు రైతులతో మమేకమవ్వాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 2: వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రైతులతో మమేకమైనప్పుడే క్షేత్రస్థాయిలో వారి సమస్యలు తెలుసుకోవచ్చని కోరుట్ల పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ సూచించారు. పెద్దాపూర్ గ్రామంలో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ భారతి, ఈఆర్జీ డాక్టర్ ప్రజ్ఞ, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి పరామర్శ

జగిత్యాల, నవంబర్ 2: పట్టణంలోని టవర్ సర్కిల్ సమీపంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన అమ్మాజీ డ్రెస్సెస్ దుకాణాన్ని శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరిశీలించారు. యజమాని ప్రసాద్‌తో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, కమటాల శ్రీనివాస్, గాజుల రాజేందర్, రేపల్లె హరి, గంగాధర్, తదితరులున్నారు.

అతిథి అధ్యాపకులను ఆదుకోవాలి

రాయికల్, నవంబర్ 2: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు.

పాఠశాలల్లో తీరిన నీటి సమస్య

తాగునీటి కుళాయిల వద్ద గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మల్లాపూర్, నవంబర్ 2: రేగుంటలోని ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రం, బోర్ మోటరు చెడిపోయి నీటి కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న టీవీఎస్వీ జాతీయ స్వచ్ఛంద సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ గణవేని మల్లేశ్‌యాదవ్ గ్రామస్తుల సహకారంతో రూ. 21 వేలతో నీటి శుద్ధి యంత్రం, బోర్ మోటరుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. నల్లాలు చెడిపోగా మరమ్మతులు చేయించారు. పాఠశాలల్లో నీటి సమస్యను పరిష్కరించిన గ్రామస్తులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజు, శంకర్‌బాబు, గ్రామస్తులు నరేశ్, రమేశ్, అశోక్, హబీబ్, గౌతం పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

మల్లాపూర్, నవంబర్ 2: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీర్‌సింగ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను ఆర్ఐలు సురేశ్‌కుమార్, రాజేశ్, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మల్లాపూర్, నవంబర్ 2: మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల మినీగురుకుల పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రియాంక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, సుమలత, సులోచన, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన రైతులు

జగిత్యాల, నవంబర్ 2: సారంగాపూర్ మండలం ధర్మానాయక్ తాండ బంజారా రైతులు శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ శివారులోని ఖాళీ స్థలాన్ని వడ్ల కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

మాజీ వైస్ ఎంపీపీ జువ్వాడి సూర్యారావు మృతి

ధర్మపురి, నవంబర్ 2: ధర్మపురి లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ జువ్వాడి సూర్యారావు (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య భారతి, నలుగురు కూతుళ్లు ఉన్నారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కలెక్టర్‌కు వినతి

ధర్మపురి/వెల్గటూర్, నవంబర్ 2: తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేస్తున్న నేపథ్యంలో కులగణన ఫార్మాట్ కోడ్ నంబర్-40లో నేతాని అని కులం పేరు తప్పుగా ముద్రించారని, దాని స్థానంలో ఎస్సీ నేతకాని పేరు పొందుపరచాలని శనివారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్, తదితరులున్నారు.

వరద కాలువలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కథలాపూర్, నవంబర్ 2: కథలాపూర్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన సుంకరి బుచ్చమ్మ(70) వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుచ్చమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కాగా, పెగ్గెర్ల శివారులోని వరదకాలువలో బుచ్చమ్మ మృతదేహాన్ని శనివారం గుర్తించారు. మృతురాలి మేనల్లుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

అంజన్న ఆలయంలో ప్రత్యేక దీపారాధన

మల్యాల, నవంబర్ 2: కొండగట్టు అంజన్న ఆలయ సామూహిక వ్రత మండపంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రత్యేక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, అర్చకులు రాము, మారుతీ, శ్రీకాంత్, ఆలయ పర్యవేక్షకుడు హరిహరనాథ్, వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

గురుకులంలో సంబురాలు

గొల్లపల్లి, నవంబర్ 2: రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ గొల్లపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుష్మిత విద్యార్థులతో కేక్ కట్ చేయించారు.

బీఆర్ఎస్ నాయకుడి ఔదార్యం

జగిత్యాల రూరల్, నవంబర్ 2: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి ప్రశాంత్-సంధ్య దంపతుల కూతురు రియాన్విక శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నది. వెంటిలేషన్‌పై ఉంచగా, రోజుకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేలు ఖర్చు అవుతున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్ జగిత్యాలలోని నైరితి దవాఖాన యాజమాన్యంతో మాట్లాడి రియాన్వికను చేర్పించాడు. డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. కాగా, రాజేంద్రప్రసాద్‌కు రియాన్విక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గోదావరి హారతి

గోదావరికి హారతి ఇస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్, భక్తులు

ధర్మపురి, నవంబర్ 2: కార్తీక మాసం మొదటి రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి మేళతాళాల మధ్య గోదావరి నది వరకు పండితులు, అర్చకులు, భక్తులు శోభాయాత్రగా వెళ్లారు. పుష్కరఘాట్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద పండితులు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, భక్తులతో కలిసి గోదావరి నదికి హారతి ఇచ్చారు. నదిలో కార్తీక దీపాలను వదిలి భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై గోదావరికి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోదావరి నదీమాతల్లి ఆశీస్సులు భక్తులపై ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, నాయకుడు దినేశ్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మారుతీనగర్, నవంబర్ 2: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. ఈ నెల 6వ తేదీ వరకు ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

ధర్మపురి, నవంబర్ 2: అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం తహసీల్ కార్యాలయంలో డీటీ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చెందోళి శ్రీనివాస్, పట్టణాధ్యక్షులు పులి ప్రేమిత్, జిల్లపెల్లి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

పెగడపల్లి, నవంబర్ 2: పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయం ఎదుట కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రాజు ఆంజనేయులు, బండి వెంకన్న, మంత్రి హరిగోపాల్, రంగు ప్రభాకర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, నీరటి రాజేందర్, రాజ్‌కుమార్, కుంటాల లక్ష్మీరాజం, లైశెట్టి దామోదర్, దీకొండ దుర్గయ్య, పరశురాంగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కుల సంఘాల సభ్యులు

జగిత్యాల, నవంబర్ 2: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వివిధ కుల సంఘాల సభ్యులు శనివారం రాత్రి కలిశారు. మంచినీళ్ల బావి ప్రాంతంలో చింతకుంట వెళ్లేదారిలో ప్రభుత్వ స్థలంలో కొంతమంది షెడ్లు వేసి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని విన్నవించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల రాంకుమార్, వివిధ కుల సంఘాల నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా దీపారాణి

కోరుట్ల, నవంబర్ 2: పట్టణానికి చెందిన జిల్లా దీపారాణి తెలంగాణ చేనేత ఐక్య వేదిక మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోరుట్ల, నవంబర్ 2: పట్టణానికి చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి పీసరి నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శనివారం పరామర్శించారు. నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రైతులకు సరిపడా ఎరువులు నిల్వ చేసుకోవాలి

మేడిపల్లి, నవంబర్ 2: యాసంగి సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులు నిల్వ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రామచందర్ సొసైటీ అధికారులకు సూచించారు. మండలంలోని కట్లకుంట, పోరుమల్ల సొసైటీ గోదాముల్లో నిల్వ ఉన్న యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను శనివారం ఆయన పరిశీలించారు. ఏవో షాహిద్ అలీ, సిబ్బంది తదితరులున్నారు.

'శ్రీవేంకటేశ్వర శతక కావ్యం' ఆవిష్కరణ

మేడిపల్లి, నవంబర్ 2: కొండాపూర్‌లోని పద్మశాలీ కల్యాణ భవనంలో శనివారం త్రిశతక కర్త, రిటైర్డ్ టీచర్ పత్తి రాజన్న రాసిన 'శ్రీవేంకటేశ్వర శతక కావ్యం' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాజన్న, కైలాసం, విద్యాసాగర్‌రావు, గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

కథలాపూర్, నవంబర్ 2: వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్‌శాఖ ఏడీ జైసింగ్ హెచ్చరించారు. సిరికొండ శివారులోని వాగును శనివారం ఆయన మండలాధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వినోద్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, సుదర్శన్, ఆర్ఐ నాగేశ్, సిబ్బంది ఉన్నారు.

వర్షాలకు కూలిన మర్రిచెట్టు రీప్లాంటేషన్‌కు కృషి

మల్యాల, నవంబర్ 2: భారీ వర్షాలకు జగిత్యాల-కరీంనగర్ రహదారిని ఆనుకొని రాజారాం శివారులో ఓ మర్రి వృక్షం నేలకొరిగింది. మర్రిచెట్టును రీప్లాంటేషన్ చేయాలని పలువురు సిరిసిల్లకు చెందిన ప్రకృతి ప్రకాశ్‌కు సమాచారం ఇవ్వగా, చెట్టు కొమ్మలను నాలుగైదు రోజులుగా తొలగిస్తున్నాడు. చెట్టును వేర్లతో సహా తొలగించి, తిరిగి సారంగపూర్‌లోని అటవీ ప్రాంతంలో నాటేందుకు ఎక్స్‌కవేటర్‌తో పాటు హైడ్రాలిక్ జాకీ అవసరమవగా ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రకృతి ప్రేమికులు ఆర్థిక సాయం చేసి చెట్టుకు జీవం పోయాలని కోరుతున్నాడు. దాతలు సెల్ నంబర్ 89851 01214కు నగదు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఆటో యూనియన్ కార్యవర్గం

పెగడపల్లి, నవంబర్ 2: పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామంలో శనివారం గాయత్రి ఆటో యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి అంజయ్య, ఉపాధ్యక్షుడిగా చెన్నాల అరుణ్, గౌరవాధ్యక్షుడిగా మంద రమేశ్, కోశాధికారిగా మల్యాల రవి, డైరెక్టర్లుగా గంగస్వామి, అనిల్ ఎన్నికయ్యారు.

మొక్కలు నాటిన యూత్ సభ్యులు

గొల్లపల్లి, నవంబర్ 2: గొల్లపల్లి మోడల్ స్కూల్ ఆవరణలో 'అమ్మ పేరు మీద ఒక మొక్క నాటే' కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు శనివారం మొక్కలు నాటారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి రాంబాబు, చైల్డ్ మ్యారేజ్ కో-డైరెక్టర్ భూమేశ్, తదితరులున్నారు.

ఎల్వోసీ అందజేత

జగిత్యాల, నవంబర్ 2: పట్టణంలోని టీఆర్‌నగర్‌కు చెందిన చిట్యాల మురళీ తుంటి ఎముక సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్స కోసం డబ్బులు లేకపోవడంతో స్థానిక కౌన్సిలర్ చాంద్ పాషా విషయం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. లక్ష ఎల్వోసీ మంజూరు చేయించారు. మురళీకి శనివారం ఎల్వోసీ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చాంద్ పాషా, నాయకులు తదితరులున్నారు.

జగిత్యాల రూరల్, నవంబర్ 2: రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మంత్రి రాజ్‌కుమార్ కొడుకు హనీశ్విత్(7) గుండె సంబంధింత వ్యాధితో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్స కోసం రూ. 1.35 లక్షల ఎల్వోసీ మంజూరు కాగా, హనీశ్విత్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఇక్కడ ప్యాక్స్ చైర్మన్ ముత్యం రెడ్డి, లక్ష్మణ్, మనోజ్, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, నవంబర్ 2: ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట చేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 5లోగా దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

చెట్ల నరికి వేత

కోరుట్ల రూరల్, నవంబర్ 2: మండలంలోని ఆయా గ్రామాల శివారులో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం లక్షలు వెచ్చిస్తూ మొక్కలను నాటుతుంటే, కొందరు అక్రమంగా చెట్లను నరికివేసి సొమ్ము చేసుకుంటారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అక్రమంగా చెట్లను నరికివేస్తున్న వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అలరించిన ఫ్రెషర్స్‌డే

జగిత్యాల రూరల్, నవంబర్ 2: జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం స్థానిక వాసవి గార్డెన్‌లో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్ పల్లెర్ల నరేశ్, ప్రిన్సిపాల్ రాజేందర్, వెంకటరమేశ్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189